సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025

రాష్ట్రంలో పగ, దగా పథకాలే..

- కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది
- గ్రూప్–2 అభ్యర్థులను చంద్రబాబు మోసం చేశారు
- ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం
- జగన్ కోసం ప్రాణాలు ఇచ్చే వారు కోట్లాది మంది ఉన్నారు
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా కన్నబాబు బాధ్యతల స్వీకరణ





మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు. చిత్రంలో అరకు ఎంపీ తనూజరాణి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు అమర్‌నాథ్, చిన్న శ్రీను, ధర్మాన కృష్ణదాస్, పార్టీ నేతలు (ఇన్‌సెట్) కన్నబాబును అభినందిస్తున్న బొత్స సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో చంద్రన్న పగ.. చంద్రన్న దగా సంక్షేమ పథకాలే అమలవుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒకటి కూడా పూర్తి స్థాయిలో అమలుచేసిన పాపానపోలేదని, ఈ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం లేదని పేర్కొన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమన్వయ కర్తగా బృహత్తరమైన బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాంధ్ర అంటే ఉద్యమాలకు పురిటి గడ్డలాంటిదని, ఈ ప్రాంత ప్రజలు ఉద్యమిస్తే.. సాధించేవరకూ పట్టు వదలరని కొనియాడారు. అలాంటి ఈ ప్రాంత అభివృద్ధి కోసం విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా చేసేందుకు అన్నివిధాలా తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేశారన్నారు. ప్రజలకు ఏమైతే మాట ఇస్తారో.. అది చేయడం వైఎస్ జగన్ నైజమన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని పూర్తిగా విస్మరించిందన్నారు. వారిచ్చిన ప్రతి హామీని అమలుచేసేలా వైఎస్సార్ సీపీ ప్రజల తరపున పోరాడుతుందని పేర్కొన్నారు. కూటమి 8 నెలల పాలనలో రూ.లక్షా 20 వేల కోట్లు అప్పు చేసిన సీఎం చంద్రబాబు.. ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని సేనల కన్నా వైఎస్ జగన్ సేన స్ట్రాంగ్‌గా ఉందని, ఆయన కోసం ప్రాణాలు ఇచ్చే కోట్లాది మంది కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు న్నారన్నారు. వైఎస్ జగన్ అంటే ఒక శక్తి.. ఆయన చాలా స్ట్రాంగ్ అని స్పష్టం చేశారు. ప్రజలే తమ బలమన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఒకరిద్దరు వెళ్లినంత మాత్రానా ఎటువంటి నష్టం లేదన్నారు.

కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ తనూజ రాణి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాస రావు, ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్ రాజ్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, సమన్వయకర్తలు కేకే రాజు, తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, పీవీ సురేష్, సాడి పద్మారెడ్డి, ఇమ్రాన్, ముఖ్యనేతలు కోలా గురువులు, రొంగలి జగన్నాథం, చొక్కాకుల వెంకట్రావ్, మొల్లి అప్పారావు, రవిరెడ్డి, పేర్ల విజయచందర్, కాయల వెంకటరెడ్డి, పేడాడ రమణికుమారి, మారుతీప్రసాద్, బోని శివరామకృష్ణ, శ్రీదేవి వర్మ, మాధవి వర్మ, పీలా వెంకటలక్ష్మి, కాళిదాస్‌రెడ్డి, సనపల రవీంద్ర భరత్, అల్లంపల్లి రాజుబాబు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్రూప్–2 అభ్యర్థుల యువగర్జన చూశాం

ఎన్నికలకు ముందు లోకేష్ యువగళమంటూ తిరిగాడు.. అసలుసిసలైన యువగర్జన విశాఖ కేంద్రంగా గ్రూప్–2 అభ్యర్థులు చేశారని కన్నబాబు అన్నారు. గ్రూప్–2 పరీక్ష వాయిదా వేస్తామంటూ నమ్మించి అభ్యర్థులను చంద్రబాబు మోసం చేశారన్నారు. నిరుద్యోగులనే కాదు.. మహిళలు, అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం దగా చేసిందని మండిపడ్డారు.



కఠిన పరీక్ష

గ్రూప్–2 అభ్యర్థులతో ఆటలాడుకున్న కూటమి ప్రభుత్వం

పరీక్ష వాయిదా వేస్తామంటూ ఆఖర్లో చేతులెత్తేసిన వైనం

చంద్రబాబు సర్కారుకి బలైన నిరుద్యోగ అభ్యర్థులు

మొదటి పేపర్‌కు 85.14 శాతం, రెండో పేపర్‌కు 84.95 శాతం హాజరు

సాక్షి, విశాఖపట్నం : ఏపీపీఎస్సీ చరిత్రలో ఎన్నడూ లేని గందరగోళం. చంద్రబాబు సర్కారు బాధ్యతారాహిత్యంతో చివరి వరకు అభ్యర్థుల్లో ఆందోళన. చివరికి పరీక్ష కేంద్రంలోనూ తీవ్ర ఒత్తిడికి గురయ్యే పరిస్థితి ఏర్పడింది. రోస్టర్ విధానంపై గత కొంతకాలంగా గ్రూప్–2 అభ్యర్థులు పోరాటాలు చేస్తున్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గ్రూప్–2 అభ్యర్థులకు న్యాయం చేస్తానంటూ ట్వీట్ చేశారు. సీఎం చంద్రబాబు పరీక్ష వాయిదా వెయ్యాలంటూ ఏపీపీఎస్సీకి లేఖ రాశారు. దీంతో పరీక్ష ఆగిపోతుందని అభ్యర్థులు భావించారు. పరీక్ష వాయిదా వెయ్యలేమంటూ ఏపీపీఎస్సీ చెప్పడంతో అభ్యర్థులు ఒత్తిడికి గురయ్యారు. పరీక్షకు 8 గంటల ముందు వరకూ చంద్రబాబు ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెప్పి నిరుద్యోగులతో ఆటలాడుకుంది. చివరికి పరీక్షకు వెళ్లాలంటూ చెప్పేసింది.

పరీక్ష రాసినా ఏం ఉపయోగం.?

గ్రూప్–2 అభ్యర్థులు ప్రిపరేషన్‌ని పక్కనపెట్టి ప్రభుత్వంతో పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో చాలా మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనా ఫలితం లేదని భావించారు. మరికొందరు చిన్నపాటి ఆశతో పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 16 కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్షలు నిర్వహించారు. మొత్తం 11,030 మందికి గాను ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు జరిగిన తొలి పేపర్‌కు 9,391 (85.14 శాతం) మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగిన రెండో పేపర్‌కు 9,370 (84.95 శాతం) మంది హాజరయ్యారు.



నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

ఒత్తిడితోనే పరీక్ష రాసిన అభ్యర్థులు

ప్రభుత్వం చేసిన నిర్వాకంతో అభ్యర్థులంతా తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. దాదాపు ప్రతి ఒక్కరూ ఒత్తిడిలోనే పరీక్షలు రాశారు. కొందరు అభ్యర్థులు అస్వస్థతకు గురయ్యారు. కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం పరీక్ష రాస్తున్న ఓ అభ్యర్థి తీవ్ర ఒత్తిడికి లోనై అస్వస్థతకు గురయ్యారు. అధికారులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

భద్రత కట్టుదిట్టం

పరీక్ష సమయంలో ఎలాంటి ఆందోళనలు జరగకుండా చర్యలు తీసుకోవాలంటూ కూటమి ప్రభుత్వం అధికారుల్ని ఆదేశించడంతో ప్రతి కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. అణువణువు గాలింపు చర్యలు చేపట్టారు. మునుపెన్నడు లేని విధంగా డ్రోన్లతో పరీక్ష కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరం వరకూ తనిఖీలు చేపట్టారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమే కాకుండా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అన్ని పరీక్షా కేంద్రాలను కెమెరాలతో అనుసంధానం చేస్తూ డ్యాష్ బోర్డుతో కూడిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.



డ్రోన్ కెమెరాలతో నిఘా



పరీక్ష హాల్ మరో చోట అని చెప్పడంతో పరుగులు తీస్తున్న అభ్యర్థులు

అధికారుల పర్యవేక్షణ

కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి పలు కేంద్రాలకు వెళ్లి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఏయూలోని న్యూ క్లాస్ రూమ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని, జైల్ రోడ్డులోని డిగ్రీ మహిళా కళాశాల, సీతంపేట పరిధిలోని బీవీకే, ప్రిజమ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి అక్కడ పరిస్థితిని పరిశీలించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ద్వారా డీఆర్వో భవానీశంకర్ పరిస్థితిని సమీక్షించారు.

- అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి చెందిన డి.శ్యామల కొమ్మాదిలోని విజయం స్కూల్ పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా రావడంతో బయట నిలిపివేశారు. అలాగే రొంగలినాయుడుపాలేనికి చెందిన కొండబాబు బీవీకే కళాశాల కేంద్రానికి ఆలస్యంగా రావడంతో సిబ్బంది లోపలకు అనుమతించలేదు.

డూప్లికేట్ హాల్ టికెట్‌తో హాజరు

సీతంపేట: డూప్లికేట్ హాల్ టికెట్‌తో గ్రూప్–2 మెయిన్స్ పరీక్షా కేంద్రంలోకి ఓ యువతి ప్రవేశించింది. సీతంపేట ప్రిజం డిగ్రీ కళాశాల సెంటర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. నెల్లూరుకు చెందిన నందిని అనే విద్యార్థిని ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అవ్వని విషయాన్ని దాచిపెట్టి మెయిన్స్ పరీక్ష కోసమని తల్లిదండ్రులతో కలిసి విశాఖ వచ్చింది. పరీక్ష కేంద్రంలో సిబ్బంది ఆమె డూప్లికేట్ హాల్ టికెట్‌ను చూసి ఈ నంబరు లేదని చెప్పారు. వెంటనే ఆమె బాత్ రూమ్‌కు అంటూ వెళ్లి అక్కడ స్పృహ తప్పి పడిపోయింది. దీంతో పరీక్షా కేంద్రం సిబ్బంది ద్వారకా పోలీసుల సాయంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి తల్లిదండ్రులతో నెల్లూరు పంపించేశారు. దీనిపై ద్వారకా సీఐ రమణను వివరణ కోరగా సంఘటన జరగడం వాస్తవమే అని తెలిపారు.

ఇక కోర్టులోనే తేల్చుకుంటాం..



రోస్టర్‌లో తప్పిదాలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం గ్రూప్–2 మెయిన్స్ వాయిదా వేస్తుందని భావించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్పందించి పరీక్ష వాయిదాపై ఏపీపీఎస్సీకి సూచించడం, మంత్రి లోకేష్ న్యాయ నిపుణులతో మాట్లాడుతున్నాం.. అభ్యర్థులకు న్యాయం చేస్తాం అని ట్విట్టర్ ద్వారా స్పందించంతో సానుకూల నిర్ణయం వస్తుందని ఆశించాం. మేము ఊహించని విధంగా మాకు ఎదురుదెబ్బ తగిలింది. ఆదివారం పరీక్షకు హాజరైనప్పటికీ మాకు న్యాయం జరుగుతుందనే ఆశ లేదు. ఇక కోర్టులోనే న్యాయ పోరాటం చేస్తాం.

– లోకేష్, గ్రూప్–2 అభ్యర్థి

నిరుద్యోగులను మోసం చేయడమే..



నిరుద్యోగులకు మంచి చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవు. పైగా అభ్యర్థులు నష్టపోకుండా గ్రూప్–2 రోస్టర్‌ను సరిచేయాలని, అంతవరకు పరీక్ష వాయిదా వేయాలని ఉద్యమించినా ప్రభుత్వం ఖాతరు చేయలేదు. శనివారం రాత్రి వరకు నిరసన చేపట్టిన అభ్యర్థులు చేసేది లేక ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి వేర్వేరు జిల్లాల్లోని పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరీక్ష రాశారు. కూటమి ప్రభుత్వం ఇందుకు మూల్యం చెల్లించక తప్పదు. ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు వచ్చే అన్ని ఎన్నికల్లో బుద్ధి చెబుతాం.

– రోహిత్ కుమార్, గ్రూప్–2 అభ్యర్థి

అరకులోయ, అనంతగిరిలలో బ్రెస్ట్ ఫీడింగ్ రూంలు

అరకులోయటౌన్/అనంతగిరి(అరకులోయటౌన్): ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో నాలుగు చోట్ల బ్రెస్ట్ ఫీడింగ్ రూంలు ఏర్పాటు చేసినట్టు సీడీపీవో శారద తెలిపారు. కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు అరకులోయలోని రైల్వే స్టేషన్, ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామ సచివాలయ కార్యాలయాల వద్ద ఈ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా పోస్టర్లు విడుదల చేశారు.అనంతగిరి మండలంలో ఏడు చోట్ల బ్రెస్ట్ ఫీడింగ్ రూంలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో కుమార్ తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవో, అనంతగిరి సచివాలయ కార్యాలయాల వద్ద, నాలుగు పీహెచ్‌సీల్లో ఈ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అరకులోయ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గదిని పరిశీలిస్తున్న సీడీపీవో శారద, తహసీల్దార్ ప్రసాద్



అనంతగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ రూం వద్ద ఎంపీడీవో కుమార్

ఆ మూడు రోడ్లు.. తప్పిస్తాయి ముంపు తిప్పలు

విలీన మండలాల ప్రజలు వరద కష్టాల నుంచి గట్టెక్కాలంటే ఆ మూడు రహదారులే కీలకం. ప్రతి ఏటా జులై, ఆగస్టు నెలల్లో ముంపు భయంతో ప్రజలు హడలెత్తి పోతుంటారు. శబరి, గోదావరి నదులకు వరద పోటెత్తుంది. ఆ సమయంలో వరద బాధితుల కష్టాలు వర్ణనాతీతం. వరద కష్టాలు తొలగాలంటే కీలకమైన మూడు ప్రధాన రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఉంది.

- ఆ రోడ్లు నిర్మిస్తే అత్యవసర సేవలకు మార్గం సుగమం
- నిత్యావసరాలు, తాజా కూరగాయల తరలింపు సులభం
- ముంపులో లేని గ్రామాలకూ ఉపయోగం
- నిర్మాణంపై దృష్టి సారించాలని కోరుతున్న వరద బాధితులు

కూనవరం: మండలాన్ని వరదనీరు మూడు వైపుల నుంచి చుట్టు ముడుతుంది. ఒక వైపు పూర్తిగా అటవీప్రాంతం కావడంతో వరద బాధితులు బయటకు వెళ్లే పరిస్థితి ఉండదు. అత్యవసర సేవలు అందాలంటే అడవి మార్గాల్లో వాగులు, వంకలు దాటి నానా అవస్థలు పడుతూ ఐదారు గంటలు ప్రయాణించాలి. అప్పటికి చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి జాతీయ రహదారిని చేరుకోవచ్చు. అక్కడి నుంచి భద్రాచలం వెళ్లేందుకు రోడ్డు మార్గం ఉంది. ఆరోడ్డును చేరుకోవాలంటే కూనవరం నుంచి చింతూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై మూడు చోట్ల బీటీ లేదా కనీసం మెటల్ రోడ్డు అయినా నిర్మిస్తే 90 శాతం వరద బాధితుల కష్టాలు గట్టెక్కుతాయి.



కోతులగుట్ట,టూబోదునూరు, ఏడుగురాళ్ళపల్లి రోడ్డు



చినార్కూరు సచివాలయం నుంచి బోదునూరు వెళ్లే రోడ్డు



కోతులగుట్టలో వరద బాధితుల పునరావాసకేంద్రం (ఫైల్)

రోడ్లపై దృష్టి పెట్టాం



వరదలకు ముందే రోడ్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించాం.కోతులగుట్ట, బోదునూరు, ఏడుగురాళ్లపల్లి రోడ్డును బిట్లు, బిట్లుగానైనా రెండు నెల్లలో పూర్తి చేయాలని ఆదేశించాం. ఐదు కల్వర్టులు మంజూరు చేశాం. అటవీ అభ్యంతరాలు ఉన్నచోట ఇంజినీరింగ్, అటవీశాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించాం. భైరవపట్నం పునరావాసం వారికి ఇది ప్రధాన రహదారి.

– ఎ.ఎస్. దినేష్ కుమార్, కలెక్టర్

కీలకమైన రహదారులు ఏవంటే..

- కోతులగుట్ట పునరావాస కేంద్రం నుంచి బోదునూరు మీదుగా ఏడుగురాళ్ల పల్లి జాతీయ రహదారి వరకు బీటీ రోడ్డు నిర్మిస్తే 16 పంచాయతీల్లోని 56 గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుంది.అత్యవసర సేవలకు ఢోకా ఉండదు. ఎంత పెద్ద వరదలు వచ్చినా నిత్యావసర వస్తువులు, తాగునీటిని తరలించవచ్చు. 24 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రహదారిలో కేవలం 13 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. పోలవరం నిర్మాణం పూర్తి అయితే ముంపులో లేని పలు గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి అవుతుంది. కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే పాత ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా పోలవరం ముంపులో ఉంటుంది. ఆ రూట్ బోదునూరు నుంచి ఏడుగురాళ్లపల్లి రహదారికి ప్రత్యామ్నాయ రహదారి అవుతుంది.

చినార్కూరు నుంచి బోదునూరు..

చినార్కూరు నుంచి బోదునూరుకు 5.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మిస్తే.. చినార్కూరు, పెదార్కూరు, కొండ్రాజుపేట పంచాయతీ పరిధిలోని 15 గ్రామాల ప్రజల వరద కష్టాలు తొలుగుతాయి. కోతులగుట్ట, పండ్రాజుపల్లి మధ్య వరదనీరు చేరడంతో ఆయా గ్రామాల ప్రజలకు కోతులగుట్ట ప్రధాన పునరావాస కేంద్రంతో సంబంధాలు తెగిపోతాయి. నిత్యావసరాలు తెచ్చుకోవాలన్నా, సంబంధిత అధికారులకు సమాచారం చేరవేయాలన్నా అవకాశం ఉండదు.

బురదగూడెం నుంచి తుమ్మల..

అభిచర్ల పంచాయతీ పరిధిలోని బురదగూడెం నుంచి ఏకవారిగూడెం మీదుగా తుమ్మల గ్రామం వరకు 3 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపడితే కూటూరు, అభిచర్ల, లింగాపురం, రేగుపాడు పంచాయతీల్లోని ప్రజలు వరద కష్టాల నుంచి గట్టెక్కుతారు. అధికారులు స్పందించి ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటే వరదల నాటికి రోడ్ల నిర్మాణం పూర్తి చేయవచ్చని ప్రజలు కోరుతున్నారు.

గతంలో రోడ్డు మంజూరైంది



నార్కూరు, బోదునూరు మధ్య గత ప్రభుత్వ హయాంలో రోడ్డు మంజూరైంది. మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ భూమి పూజ నిర్వహించారు. రూ. 1.75 కోట్లతో 5.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉంది.

– పాయం రంగమ్మ,ఎంపీపీ కూనవరం మండలం

గిరిజనుల చిరకాల వాంఛ



కోతులగుట్ట నుంచి బోదునూరు మీదుగా ఏడుగురాళ్లపల్లి రహదారి నిర్మాణం గిరిజనుల చిరకాల వాంఛ. వరదల సమయంలో సహాయక చర్యలకు కీలకమైన ఈ రోడ్డు గురించి జెడ్పీ సమావేశాలలో అనేక సార్లు ప్రస్తావించాను. చింతూరు ఐటీడీఏ గతంలో పీవోలు , ప్రస్తుత కలెక్టర్ దినేష్ కుమార్‌ల దృష్టికి తీసుకు వెళ్లాను.

– గుజ్జా విజయ, జెడ్పీటీసీ, కూనవరం మండలం

ఐదు పంచాయతీలకు మేలు



బురదగూడెం నుంచి తుమ్మల గ్రామం వరకు దూరం 4 కిలోమీటర్లు. రెండు కిలోమీటర్ల మేర తుమ్మల నుంచి రోడ్డు వేశారు. మరో రెండు కిలోమీటర్లు రోడ్డు నిర్మిస్తే ఐదు పంచాయతీలకు ప్రయోజనంగా ఉంటుంది.

– కొమరం పెంటయ్య, వైస్ ఎంపీపీ కూనవరం మండలం

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి,పాడేరు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. పాడేరు పట్టణంతో పాటు హుకుంపేట మండలం మత్స్యగుండం, రాజమొమ్మంగి, వై.రామవరం తదితర ప్రాంతాల్లో ఉత్సవాల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేశారు. పాడేరు పట్టణంలో ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు, మత్స్యగుండంలో 25,26,27 తేదీల్లో, రాజమొమ్మంగి మండల జడ్డంగిలో మడేరు వాగు చెంత కొండగుహలో స్వయంభూగా వెలసిన భ్రమరాంభికా మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

పాడేరులో నేటి నుంచి..

పాడేరు పట్టణంలోని పురాతన ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 24వతేదీ నుంచి మూడు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. ఇందుకోసం శివాలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయి. సాయంత్రం 5గంటలకు మోదకొండమ్మతల్లి ఆలయం నుంచి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పిస్తారు. రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు.25వ తేదీ మంగళవారం సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తారు.26న ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహిస్తారు.శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, కమిటీ సభ్యులు కోరారు. మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలోని శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



పాడేరులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయం

పర్యాటక కేంద్రాలు వెలవెల



పర్యాటకులు లేక బోసిపోయిన చాపరాయి జలపాతం

డుంబ్రిగుడ: జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. నిత్యం టూరిస్టులతో సందడిగా ఉండే ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం బోసిపోయింది. శని, ఆదివారాలలో సందర్శకులు రాకపోవడంతో వెలవెలబోయింది. టెన్త్, ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండడంతో పాటు కుంభమేళ కారణంగా పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని స్థానికులు తెలిపారు.

చింతపల్లి: ఆంధ్రా కాశ్మీరు లంబసింగికి వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గింది. గతంలో సెలవు రోజుల్లో అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చేవారు. ఈ శని, ఆదివారాల్లో వచ్చిన తక్కువ మంది టూరిస్టులు లంబసింగి,తాజంగి జలాశయాలతో పాటు చెరువులువేనం వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు.



చెరువుల వేనం వ్యూపాయింట్ వద్ద ..

పరిశోధకుల పరీక్షలకు గ్రీన్ సిగ్నల్

- వీసీ శశిభూషణ్ తప్పుకున్న రోజునే సర్క్యులర్
- హయ్యర్ ఎడ్యుకేషన్ మౌఖిక ఆదేశాలు అంటూ వెల్లడి
- అభియాన్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవటంలో అంతా గోప్యత
- టీడీఆర్ హబ్ ప్రవేశాలపై ఎందుకీ హైడ్రామా
- అవినీతి ఆచార్యులతో ఏయూకు అప్రతిష్ట



టీడీఆర్ హబ్

విశాఖవిద్య: ఆంధ్ర యూనివర్సిటీలో పీహెచ్‌డీ స్కాలర్స్ పరీక్షలకు వర్సిటీ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టీడీఆర్ హబ్ ద్వారా ప్రవేశాలు పొందిన రీసెర్చ్ స్కాలర్స్ విషయంలో జనవరి 28న ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటున్నట్లు వర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్ తాజాగా మరో ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత విద్యామండలి మౌఖిక ఆదేశాల మేరకు ఇది తక్షణమే అమల్లోకి వస్తోందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆచార్య శశిభూషణరావు వీసీగా బాధ్యతల నుంచి రిలీవ్ అయిన రోజే (ఈ నెల 18న) ఉత్తర్వులు జారీ కాగా, వర్సిటీ విభాగాధిపతులకు అవి చేరకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వర్సిటీకి నూతన వైస్‌చాన్సలర్‌గా నియమితులైన ఆచార్య రాజశేఖర్ నేడో, రేపో బాధ్యతలు చేపట్టనున్నారు. ఇలాంటి సమయంలో, ఆచార్య శశిభూషణరావు వీసీగా తప్పుకున్న రోజున ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తారా..? లేదా..? అనే అనుమానాలను కొంతమంది ఆచార్యులు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు, ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయాలతో టీడీఆర్ హబ్ ద్వారా చేపట్టిన ప్రవేశాలపై ప్రస్తుత అధికారులు అనుసరిస్తున్న విధానాలు రీసెర్చ్ స్కాలర్స్‌ను గందరగోళానికి గురిచేస్తున్నాయి.

టీడీఆర్ హబ్‌పై ఎందుకీ హైడ్రామా

ఆంధ్ర యూనివర్సిటీలో 2019 నుంచి 2023 వరకు 680 మంది విద్యార్థులు పీహెచ్‌డీ కోర్సుల్లో చేరారు. వీరితో పాటు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదంతో మరో 72 మంది వరకు ప్రవేశాలు పొందారు. ఇదంతా నిబంధనల మేరకే జరిగినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, వర్సిటీలో రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. ఈ ప్రభావం రీసెర్చ్ స్కాలర్స్‌పై చూపుతోంది. టీడీఆర్ హబ్ ప్రవేశాల విషయంలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలే తప్ప, పరీక్షలు నిలిపివేయడమేంటని పరిశోధక విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. ఇది దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. వర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటుందని భావించిన ఉన్నత విద్యామండలి, పరీక్షల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

అవినీతి ఆచార్యులతోనే అప్రతిష్ట

ఆంధ్ర యూనివర్సిటీకి ఉన్న క్రేజ్‌తో ఇక్కడ పరిశోధనలు చేసేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఆసక్తి చూపుతారు. అయితే, వర్సిటీకి మరింత ఖ్యాతి ఇనుమడింపజేసేలా ప్రసాద్ రెడ్డి వీసీగా ఉన్న సమయంలో ట్రాన్స్ డిసిప్లెనరీ రీసెర్చ్ (టీడీఆర్) హబ్‌ను ఏర్పాటు చేసి, దీని ద్వారానే పరిశోధనలకు సంబంధించిన ప్రవేశాలు చేపట్టారు. డాక్టరేట్ ప్రదానం చేసేందుకు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసే, వర్సిటీలోని ఒకరిద్దరు ఆచార్యులకు ఇది మింగుడుపడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రెక్కలొచ్చిన సదరు అవినీతి ఆచార్యులు, పనిగట్టుకొని ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడంతో రీసెర్చ్ స్కాలర్స్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టాయనే ప్రచారం ఉంది.

ఏపీఆర్‌సెట్ విద్యార్థులకే వెసులుబాటు

రీసెర్చ్ స్కాలర్స్ పరీక్షల విషయంలో గతంలో ఇచ్చిన అభియాన్స్ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న మాట వాస్తవమే. ఏపీఆర్‌సెట్ ద్వారా ప్రవేశాలు పొందిన వారికే పరీక్షలు కొనసాగించేలా ఉన్నత విద్యామండలి నుంచి మౌఖిక ఆదేశాలు ఉన్నాయి. ఇదే విషయాన్ని వర్సిటీ అన్ని విభాగాధిపతులకు సమాచారం ఇచ్చాం.

–కె. ఈశ్వర కుమార్, అకడమిక్ ఎఫైర్స్ డీన్

మాకెలాంటి ఉత్తర్వులు అందలేదు

రీసెర్చ్ స్కాలర్స్ పరీక్షలు నిర్వహించాలని మాకు ఎలాంటి ఉత్తర్వులు ఇంకా అందలేదు. ఏదైనా అంతా నిబంధనలు మేరకే జరుగుతుంది. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగానే టీడీఆర్ హబ్ నిర్ణయాలు ఉంటాయి. కొత్త వైస్ చాన్సలర్ వచ్చాకే రీసెర్చ్ స్కాలర్స్‌కు పరీక్షలు నిర్వహించే విషయంలో ముందుకెళ్లే అవకాశం ఉంది.

– ఆచార్య పి. మల్లికార్జునరావు, టీడీఆర్ హబ్ డీన్

శివ పూజకు సన్నద్ధం

- మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన శైవక్షేత్రాలు
- పూర్తయిన ఏర్పాట్లు


పూతిగుంట పరమేశ్వరుని ఆలయంలో ప్రత్యేకాలంకరణలో శివలింగం


మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతున్న ఆలయం

రాజవొమ్మంగి: మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. రాజవొమ్మంగిలో వట్టిగెడ్డ వాగుకు సమీపంలో కొండపై గల రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు. ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తులు పుణ్యస్నానాలాచరించేందుకు ఏర్పాట్లు చేశారు. జడ్డంగిలో మడేరు వాగు చెంత కొండగుహలో స్వయంభూగా వెలసిన భ్రమరాంభికా మల్లిఖార్జునస్వామి వారి ఆలయంలో ఈనెల 26వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగే శివరాత్రి వేడుకలు జరగనున్నాయి. మండలంలోని వంచంగి సమీపంలో రక్షిత అటవీ ప్రాంతంలో గల పురాతన ఆలయం కుంతీలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శివరాత్రి మహోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పాండవులు, కుంతీదేవి సంచరించిన ప్రాంతంగా గ్రామపెద్దలు ఈ ప్రాంతం గురించి కథలుగా చెపుతారు. మహాశివరాత్రి వేడుకలకు పరిసర ప్రాంతాల వేలాదిగా ఆదివాసీలు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకొంటారు. ఈ ప్రాంతానికి మహాశివుని ఆలయంతో పాటు సమీపంలోనే గల కుంతీదేవి ఆలయం ప్రత్యేక ఆకర్షణ. మండలంలోని లోతట్టు ప్రాంతం వాతంగి జలపాతం వద్ద గల వనదుర్గాసమేత నాగలింగేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఐదు రోజుల శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయం సమీపంలో పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలాచరించేలా ఏర్పాట్లు చేశారు. లాగరాయి, లబ్బర్తి, కింద్ర గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బట్టావారివీధి అటవీ ప్రాంతంలో స్వయంభూగా వెలసిన బుడిబుడి జంగమేశ్వర స్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వై.రామవరం: మహాశివరాత్రి వేడుకకు మండలంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండలంలోని పూతిగుంట పరమేశ్వరుడి ఆలయంలో ఏర్పాట్లు చేశారు. మండలంలోని చవిటిదిబ్బలు గ్రామ ప్రధాన రహదారికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలోని పూతిగుంట గ్రామం శివారు అటవీ ప్రాంతంలో ఉంది. పూతిగుంట పరమేశ్వరుడు కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ఈ ప్రాంత వాసుల నమ్మకం. ఆలయం ఎదుట ఉన్న పెద్ద బండరాయి పై నుంచి జాలువారే జలపాతం ప్రకృతి అందచందాలు అందరికీ కనువిందు చేస్తాయి. వీటిని తిలకించడానికి భక్తులతో పాటు ఏడాది పొడవునా పర్యాటకులు ఈ ఆలయాన్ని సందర్శిస్తారు. అయ్యప్ప, భవాని సత్యదేవ మాలధారులు ఏటా ఈ ఆలయంలోనే దీక్షలు చేపడతారు. మహాశివరాత్రిరోజు మండలంలోని గురమంద విశ్వనాథుని ఆలయాన్ని దర్శించుకున్న వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు.


ఆలయ ప్రాంగణంలో జలపాతం


రాజవొమ్మంగిలో పూజలు చేస్తున్న భక్తులు

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ



విశాఖ–లీగల్ : విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని విశాఖ న్యాయవాదుల సంఘం ఆవరణలో ఆరు జిల్లాల న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో న్యాయవాదులందరూ విశాఖకు హైకోర్టు బెంచ్, కేంద్ర పారిశ్రామిక ట్రిబ్యునల్ ఏర్పాటుకు ముందడుగు వేయాలని నిర్ణయించారు. శ్రీకాకుళం, పార్వతీపురం వంటి సుదూర ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్లాలంటే చాలా భారంగా ఉందని న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవరా సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ అన్ని రకాలుగా మోసానికి గురైందని వెల్లడించారు. అంతర్జాతీయ ఖ్యాతిని గడిస్తున్న విశాఖకు హైకోర్టు బెంచ్ కేటాయించడం అన్ని విధాల శ్రేయోదాయకమన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి. నరసింహారావు మాట్లాడుతూ విశాఖలో హైకోర్టు ఏర్పాటు సంబంధించి న్యాయశాఖకు అభ్యంతరాలు ఉండకపోవచ్చన్నారు. 1993లో హైకోర్టుమెంట్ సాధనకు న్యాయవాదులు చేసిన ఉద్యమాలను గుర్తు చేస్తూ భవిష్యత్తులో ప్రజల భాగస్వామ్యంతో పోరాడతామన్నారు. సోమవారం నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి న్యాయస్థానానికి హాజరవుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మీ రాంబాబు, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, ఏవీ పార్వతీశం, కృష్ణ శేఖర్, పూర్వ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, పాలకొండ, బొబ్బిలి, రాజాం, గజపతినగరం, అనకాపల్లి, చోడవరం, తుని, యలమంచిలి, విజయనగరం, ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో న్యాయవాదులు ఈ సదస్సులో పాల్గొన్నారు. న్యాయవాద సంఘం కార్యదర్శి డి.నరేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

వ్యవసాయ, పర్యావరణంపై అధ్యయనాలు


మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్ గలాబ్

కొమ్మాది: రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయంగా వివిధ పాలసీలకు సంబంధించిన సమస్యలపై అధ్యయనం చేసేందుకు ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఏపీ (ఐడీఎస్‌ఏపీ) స్వతంత్ర్య సంస్థగా ఆవిర్భవించిందని డైరెక్టర్ ఎస్.గలాబ్ అన్నారు. మధురవాడ మిధులాపురి వుడా కాలనీలో సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రముఖ ఆర్థికవేత్త రొక్కం రాధాకృష్ణ ఆలోచనలతో రూపకల్పన చేసిన సంస్థను 2018–19లో ప్రారంభించామన్నారు. విశాఖ కేంద్రంగా మధురవాడలో కార్యాలయం ఏర్పాటు చేసి వ్యవసాయ, పర్యావరణ సానుకూల సామర్థ్య పరిశీలన తదితర అంశాలపై నిత్యం అధ్యయనాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు సంస్థ రొక్కం రాధాకృష్ణ జ్ఞాపకార్థం ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో స్మారక ఉపన్యాసం జరుగుతుంని, దీనికి రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జె.రామునాయుడు, విజిటింగ్ ప్రొఫెసర్ సి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఎత్తివేతకు యత్నం!

- ఐదు పాఠశాలల్లోని విద్యార్థుల తరలింపునకు సన్నాహాలు
- ససేమిరా అంటున్న తల్లిదండ్రులు, విద్యార్థులు
- అంగీకారం కోసం ఎంఈవో ఆధ్వర్యంలో కమిటీల ప్రయత్నాలు


అడ్డతీగల మండలం సరంపేటలో ఎంపీపీఎస్ పాఠశాల

అడ్డతీగల: విద్యా శాఖలో వింత నిర్ణయాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఇబ్బందులను తెచ్చిపెడుతుంది. అడ్డతీగల మండలంలోని ఐదు ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతుల విద్యార్థులను సమీపంలోని ఆశ్రమ పాఠశాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించినా, పేరెంట్స్ నుంచి విముఖత వ్యక్తమవుతుంది. ఆయా తరగతులకు చెందిన 10 మంది లోపు విద్యార్థులున్నారని వారికి సమీపంలోని వేరే పాఠశాలకు తరలించి మెరుగైన విద్య అందిస్తామని అధికారులు చెబుతున్నారు. విద్యార్థులను తరలించడం వల్ల పాఠశాలల ఎత్తివేతకు ప్రభుత్వం పన్నాగం పన్నిందని ఈ నిర్ణయానికి ఎట్టి పరిస్థితుల్లో అంగీకారం తెలపడం కుదరదని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. ఎంఈవో ఆధ్వర్యంలో సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు ప్రభుత్వ నిర్ణయాలపై వరుస భేటీలు నిర్వహిస్తున్నా ఫలితం తేలకపోవడంతో ఇప్పుడు మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలోని బృందాలు సమావేశాలకు సన్నద్ధం చేస్తున్నారు.

పేరెంట్స్ విముఖత

అడ్డతీగల మండలంలోని తియ్యామామిడి, రాయపల్లి, డి.రామవరం, సరంపేట, డి.చోడవరం మండల పరిషత్ పాఠశాలల్లో 3,4,5 తరగతులు చదువుకుంటున్న విద్యార్థులను ఆశ్రమ పాఠశాలలకు తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఆయా విద్యార్థులను పంపించినా సింగిల్ టీచర్ ద్వారా 1, 2 తరగతులు నిర్వహిస్తారని అధికారులు చెబుతున్నారు. కానీ విద్యార్థుల తల్లిదండ్రులంతా సమావేశాలు పెట్టుకుని ప్రభుత్వ నిర్ణయానికి తలొంచకూడదని ఆలోచనకు వచ్చారు.

మా బిడ్డను వేరే పాఠశాలకు పంపాం



మా అబ్బాయి కాకూరి తేజమనోహరరెడ్డి డి.చోడవరం ఎంపీపీఎస్ స్కూల్‌లో 5 వ తరగతి చదువుతున్నాడు. వేరే చోట ఆశ్రమ పాఠశాలలో తరలిస్తాం.. దానికి మీ అంగీకారం తెలపాలని అధికారులు అడిగారు. ఎట్టి పరిస్థితిలో మా పిల్లలను వేరే పాఠశాలకు పంపేది లేదు. గ్రామంలోనే చదివిస్తాం.

– కాకూరి జ్యోతిరాజు, అడ్డతీగల

ఆశ్రమ పాఠశాలకు తరలిస్తాం



ఆశ్రమ పాఠశాలలో ప్రతి సబ్జెక్ట్ టీచర్లు ఉంటారు. విద్యార్థులను అక్కడికి తరలించేందుకు తల్లిదండ్రుల అభిప్రాయాన్ని కోరుతున్నాం. కానీ వారు ఒప్పుకోవడం లేదు. సుదూరంలోని ఆశ్రమ పాఠశాలకు పంపించడం ఇబ్బందిగా పేరెంట్స్ చెబుతున్నారు.

–పి.శ్రీనివారావు, ఎంఈవో, అడ్డతీగల

అలంకరణ వస్తువుల తయారీలో శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌ఆర్‌ఎస్ హెడ్ వెంగయ్య

రంపచోడవరం: స్థానిక పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం (హెచ్‌ఆర్‌ఎస్), కొబ్బరి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొబ్బరి చిప్పలతో వివిధ రకాల అలంకరణ వస్తువుల తయారీ శిక్షణ కార్యక్రమం ఆదివారం హెచ్‌ఆర్‌ఎస్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఎస్ అధిపతి డాక్టర్ పి.సి. వెంగయ్య మాట్లాడుతూ ఆరు రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గిరిజన యువతకు ఆదాయ మార్గాలు చూపేందుకు పలు రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌వో చిట్టిబాబు, కొబ్బరి అభివృద్ధి సంస్థ నుంచి శరత్, కిరణ్ పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి


అల్లూరి సమాధులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గొలుగొండ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా విశాఖ నుంచి రెండు రోజుల పాటు బస్‌జాత కార్యక్రమం ఆదివారం కృష్ణదేవిపేట చేరుకుంది. ఇక్కడ ఉన్న అల్లూరి, గంటందొర సమాధులకు జాత సభ్యులు పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ప్రమీళా, వాడపల్లి వెంకటరమణమ్మ, చంద్, గంగాదర్ మాట్లాడుతూ అల్లూరి జీవిత చరిత్ర నేటి యువతరంకు తెలిసే విదంగా ఈ బస్ జాత కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రెండు రోజుల పాటు అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతాల్లో విద్యార్థులకు ఆయన జీవిత విశేషాలు చెప్పడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడుతో పాటు కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు


పిచ్చికుక్క దాడిలో గాయపడిన పూసం దుర్గా ప్రసాద్, మడకం బాబూరావు

గంగవరం: మండల కేంద్రం గంగవరంలో ఆదివారం ఓ పిచ్చికుక్క దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు.ప్రెసిడెంట్‌గారి వీధిలో ఓ పిచ్చికుక్క పూసం దుర్గాప్రసాద్(9),మడకం బాబూరావు(38) లపై దాడిచేసి గాయపరిచింది.దుర్గాప్రసాద్‌కి ముఖం,చేతులపై , బాబూరావుకి కాలిపై గాయలయ్యాయి. బంధువులు,స్థానికులు ఆ ఇద్దరినీ పాత గంగవరం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారిణి భావన చికిత్స చేశారు.పిచ్చికుక్క గ్రామంలోనే సంచరిస్తుండంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

అకేషియా తోట దగ్ధం


దగ్ధమైన ఆకేషియా తోటలో చెట్లను తొలగిస్తున్న యువకులు

దుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ కమలబంద గ్రామ సమీపంలో శనివారం రాత్రి విద్యుత్ తీగలు తెగిపడడంతో మంటలు చెలరేగి ఒక ఎకరంలో అకేషియా తోట దగ్ధమైంది. సుమారు రూ.75 వేలు నష్టం జరిగినట్టు అంచనా. విద్యుత్ శాఖ అధికారులకు ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాంగుల గురునాయుడు, గ్రామానికి చెందిన యువకులు మంటలను అదుపులోకి తెచ్చి, చెట్లు, తుప్పలను తొలగించారు. లైన్‌మెన్‌లు నిరంజన్, రవికుమార్ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ఇతర సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఉద్భవ్ యూత్ ఫెస్ట్‌లో డిగ్రీ విద్యార్థులకు బహుమతులు


రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఉద్భవ్ యూత్ ఫెస్ట్‌లో బహుమతులు అందుకుంటున్న రంపచోడవరం డిగ్రీ కళాశాల విద్యార్థులు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఉద్భవ్ యూత్‌ఫెస్ట్‌లో బహుమతులు పొందారు. కోలాటం, థింసా నృత్యాలను ప్రదర్శించి ప్రథమ,ద్వితీయ బహుమతులు గెలుపొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 3 వేలు, రెండవ బహుమతిగా రూ. 2వేలు ప్రైజ్ మనీని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.కె. రామచంద్రరావు చేతుల మీదుగా అందుకున్నట్టు తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు ఆనంద్, శ్రావణి, రవికుమార్‌లు అభినందించారు.

కుంభమేళాకు వెళుతూ ప్రమాదం

ఐదుగురికి గాయాలు

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని దేవీనగర్, కురుబుర హాస్టల్ ప్రాంతానికి చెందిన ఐదుగురు గాయపడ్డారు. వీరిలో నలుగురికి స్వల్ప గాయాలు కాగా లక్ష్మీదేవికి ఎడమకాలు విరిగిపోయింది. బళ్లారికి చెందిన 35 మంది యాత్రికులు, డ్రైవర్ వీరయ్య, క్లీనర్‌తో కలిసి ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు బయలుదేరారు. శనివారం విజయవాడలో కనకదుర్గ అమ్మవారికి దర్శనం అనంతరం ఆనందపురం వైపు వస్తున్నారు. డ్రైవర్ అతివేగంగా వాహనం నడుపుతూ ముందు వెళుతున్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు, పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

25 నుంచి 27 తేదీ వరకు



నర్సీపట్నం : మహా శివరాత్రి నేపథ్యంలో నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి భక్తులు గొలుగొండ ధారమట్టం, రావికతం కల్యాణలోవ శివ క్షేత్రాల దర్శనంకు వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో నెల 25 నుంచి 27వ తేదీ వరకు నర్సీపట్నం ఆర్టీసీ డిపో నుండి అధిక సంఖ్యలో బస్సులు నడిపేలా అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు బస్సులను నడుపుతున్నారు. రెండు పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 50 బస్సులు నడిపేలా ప్రజా రవాణా అధికారులు చర్యలు చేపట్టారు. రద్దీకి అనుగుణంగా అవసరమైతే బస్సుల సంఖ్యను పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా భక్తులకు సురక్షితమైన ప్రయాణం అందించేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఆర్టీసీ ఛార్జీలు పెంచకుండా సాధారణ ఛార్జీలతో భక్తులు ప్రయాణించేలా సౌకర్యం కల్పించారు.

సాధారణ ఛార్జీలే...

మహాశివరాత్రి స్నానాలకు వెళ్లే భక్తులకు బస్సులు సిద్ధంగా ఉంచాం. 50 బస్సులను నడుపుతున్నాం. రద్దీని బట్టి బస్సులను పెంచుతాం. ఆర్టీసీ సిబ్బంది నిత్య పర్యవేక్షణలో బస్సులను తిప్పుతాం. సాధారణ ఛార్జీలతోనే బస్సులు నడుపుతాం.

ధీరజ్(డిపో మేనేజర్, నర్సీపట్నం)